జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

అబిడ్స్, ఫిబ్రవరి 5 : జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, ఆరోగ్య కార్డుల జారీ తదితర సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ కోరారు. బుధవారం యూనియన్ ప్రతినిధులతో ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిని ప్రవేశ పెట్టాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు పెంచాలన్నారు. కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, శివకుమార్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఫైన్‌ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ. ఆనంద్‌రావు

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 5. మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(సీఎఫ్ఏ) ప్రిన్సిపాల్‌గా అప్లైడ్ ఆర్ట్ విభాగం హెచ్‌ఓడీగా కొనసాగుతున్న ప్రొ ఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. సీఎఫ్ఏ అధ్యాపకులు భోధన, భోధనేతర సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కళా సేవలో సాంస్కృతిక సంస్థలు ముందుండాలి

- ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారి

పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 5 : కళలు, కళాకారుల వికాసానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని ప్రభుత్వ పూర్వ సలహాదారుడు(ఐఎఎస్‌ఆర్) అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. బుధవారం శ్రద్ధ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆవిర్భావ వేడుకలు రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. వేలు ఆనందచారి, సిరిస్వామి ఉద్దండం, శివకుమారి, పులిపాటి రవీందర్‌రాజు, చింతపట్ల సుదర్శనాచార్యులు, సంజన భరద్వాజ తదితరులకు గౌరవ పురస్కారాలతో సత్కరించారు. అనంతరం కేవీ రమణచారి మాట్లాడుతూ.. మన సంస్కృతికి నిదర్శనమైన కళలను పరిరక్షించుకోవల్సిన అవసరముందన్నారు. కళలను, కళాకారులను కాపాడుకోవల్సిన బాధ్యత సాంస్కృతిక సంస్థలపై ఉందన్నారు. అంతకుముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కృష్ణచైతన్య, ఉపేందర్ శర్మ, సంజనభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ జాతీయ పోటీలకు బయల్దేరిన తెలంగాణ జట్టు

ఉత్తరాఖండ్ హరిద్వార్ రోషనాబాద్‌లో ఈనెల 7 నుంచి జరగనున్న 38వ జాతీయ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనడానికి బుధవారం తెలంగాణ జట్టు బయల్దేరి వెళ్లింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అహ్మద్ జాబ్రి కిట్లను అందజేశారు. రెజ్లింగ్ పోటీల్లో మెరుగ్గా రాణించాలని జాబ్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు నర్సింగ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 5

బీసీల అభివృద్ధికి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలి

కేంద్ర మంత్రి రాందాస్ అథవలేకు వినతిపత్రం అందిస్తున్న గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికాభివృద్ధికి రూ.2 లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రాందాస్ అథవలేను కలిసి బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు గుజ్జ కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ. 2,500 కోట్లు కేటాయించి, దేశంలోని 75 కోట్ల మంది బీసీల మనోభావాలను కించపరిచారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏపీ అధ్యక్షుడు దుర్గా నరేశ్‌యాదవ్,వేణుమాదవ్, రాకేశ్, విజయలక్ష్మి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని సిబ్బంది ధర్నా

టీవీవీపీ దవాఖానలో జీతాలు చెల్లించాలని బుధవారం రెండోరోజూ ధర్నా చేస్తున్న సిబ్బంది

బీమా వైద్య సేవల శాఖ ఉద్యోగుల నిరసన ప్రదర్శన

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 5: బీమా వైద్య సేవల శాఖను మూసివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామని ఐఎంఎస్, టీఎన్‌జీఓ డైరెక్టరేట్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీరన్న గౌడ్ అన్నారు. టీఎన్‌జీఓ బీమా వైద్యసేవల శాఖ ఉద్యోగులు బుధవారం 9వ రోజు డైరెక్టరేట్ కార్యాలయం వద్ద భోజనవిరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బీమా వైద్య సేవల శాఖను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

జీతాలు లేక రోడ్డెక్కిన టీచర్లు.. ఆదుకున్న నాంపల్లి ఎమ్మెల్యే

టీచర్లతో మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్‌శ్రీనివాస్

మెహిదీపట్నం ఫిబ్రవరి 5 : మెహిదీపట్నం విజయ్ నగర్ కాలనీ లయోలా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం గత ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో టీచర్లు బుధవారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని టీచర్లు, యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా మేనేజింగ్ కరస్పాండెంట్ జాకోబ్ యాజమాన్యం వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంతంగా 2 లక్షల రూపాయలను అప్పటికప్పుడు తెప్పించి టీచర్లకు చెల్లించారు. విజయ్‌నగర్ కాలనీ కార్పొరేటర్ ప్రతినిధి డాక్టర్ షేక్ ఖాసిం,ఏసీపీ విజయ్‌శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం

ముషీరాబాద్, ఫిబ్రవరి 5: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శృంగేరి శంకర మఠంలో హరికథా మహోత్సవాల్లో భాగంగా బుధవారం పార్వతీ కల్యాణ హరికథాగానం విశేషంగా ఆకట్టుకుంది. గద్వాల కాశీవిశ్వనాథ్ (భాగవతార్)చే పార్వతీ కల్యాణం అలరించింది. మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణచారి, జస్టిస్ పి.రజిని, ఆచార్య వెలుదండ నిత్యానందరావు,దాసరి బాలయ్య, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టండి

మెహిదీపట్నం ఫిబ్రవరి 5 : మల్లేపల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డిని కోరారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌తో జాఫర్‌ఖాన్ సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ప్రతిపాదించిన అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు.

ఫిబ్రవరి 5 వర్గీకరణ విజయోత్సవ దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల నాయకులు

రవీంద్రభారతి,ఫిబ్రవరి 5 : మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం అసెంబ్లీలో చట్టం చేసి మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై మాదిగ సంఘాల ఫ్రంట్ (ఎంఎస్ఎఫ్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 5ను ఎస్సీ వర్గీకరణ దినోత్సవంగా జరుపుకోవాలన్నారు. యావత్ మాదిగలకు నిజమైన స్వాతంత్రం ఫిబ్రవరి 5న వచ్చిందన్నారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ,మాదిగ రాజకీయపార్టీ సమితి (ఎంఆర్‌పిఎస్‌టీ)అధ్యక్షుడు చిట్టువాక ప్రభాకర్, తెలంగాణ మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగలు మాట్లాడారు. మాదిగల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనరసింహకు ధన్యవాదాలు తెలిపారు.

ఇప్పటికైనా మాల సోదరులు వర్గీకరణకు మద్దతు తెలిపి మాలమాదిగల ఐక్యతకు కృషి చేయాలన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 10లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని తెలిపారు. రూ.300 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మానసిక, దివ్యాంగ విద్యార్థులకు చేయూత

సాధన సంస్థ ఫౌండర్ సురేఖారెడ్డికి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న లీగల్ ఇండియా ట్రస్ట్ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది కేఎస్ క్రిష్ణ

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 5: పేదలకు, అనాథలకు లీగల్ ఇండియా ట్రస్ట్ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది కేఎస్ క్రిష్ణ తన వంతుగా చేయూతనందించారు. బుధవారం నగరంలోని సాధన ఇన్సిస్టిట్యూట్ ఫర్ ఇంటలెక్చువల్లీ ఛాలెంజెడ్ సంస్థకు లీగల్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో పదిక్వింటాళ్ల బియ్యాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. సాధన సంస్థ ఫౌండర్ సురేరెడ్డి మాట్లాడుతూ సాధన సంస్థలో చదువుతున్న మానసిక, దివ్యాంగ విద్యార్థులకు సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. హైకోర్టు న్యాయవాది, లీగల్ ఇండియా ట్రస్ట్ సలహాదారులు ఎన్ సీహెచ్ శ్రీధర్, డాక్టర్ వరదరాజ్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి : కార్పొరేటర్

జలమండలి డీజీఎం కృష్ణతో సమావేశమైన కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, అధికారులు

కాచిగూడ,ఫిబ్రవరి 5: కాచిగూడ డివిజన్ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం నింబోలిఅడ్డా కార్యాలయంలో జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని బస్తీల్లో శాశ్వతంగా మురికి నీరు రాకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి డీజీఎం కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

నాలాల్లో మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలి

పత్తర్‌గట్టి డివిజన్‌లో పర్యటిస్తున్న యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్

చాంద్రాయణగుట్ట ఫిబ్రవరి 5 : కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి నాలాల్లో మట్టిని ఎప్పటికప్పుడు తొలగించడానికి అధికారులు కృషి చేయాలని యాఖుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్ అన్నారు. బుధవారం పత్తర్‌గట్టీ డివిజన్‌లో కార్పొరేటర్ సోహైల్ ఖాద్రితో కలిసి ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా నాలాల్లో నీరు నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ సోహైల్ ఖాద్రి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి నాలాల పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశిస్తామన్నారు.

అసభ్యకర మేసేజ్‌లు పెట్టిన యువకుడికి జైలుశిక్ష

కాచిగూడ,ఫిబ్రవరి 5: బాలికకు అసభ్యకరమైన మేసేజ్‌లు పెట్టిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 12వ ఏఎస్‌జే కోర్టు న్యాయమూర్తి టి.అనిత తీర్పు ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 జూన్‌లో ఆంధ్ర ప్రదేశ్, బాలిరెడ్డిపాలేనికి చెందిన రమణయ్య కుమారుడు ఇంబటి మహేశ్‌కుమార్(30) బర్కత్‌పురాకు చెందిన 14 ఏండ్ల బాలికకు సెల్‌లో అసభ్యకరమైన మేసేజ్‌లు పెట్టాడు. బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు మహేశ్‌కుమార్‌ను ఆదుపులోకి తీసుకుని ఫోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం నాంపల్లిలోని 12వ ఏఎస్‌జే కోర్టులో మహేశ్‌కుమార్‌ను హాజరుపరచగా న్యాయమూర్తి టి.అనిత మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.

కాచిగూడ పాఠశాల పీడీకి ప్రశంసలు

భారత్ స్కౌట్స్ డైరెక్టర్ అమర్ బి.భత్రి నుంచి జ్ఞాపికను అందుకుంటున్న కాచిగూడ హైస్కూల్ పీడీ లక్ష్మణ్‌నాయక్

కాచిగూడ, ఫిబ్రవరి 5: తమిళనాడులోని తిరుచురాపల్లిలో గత నెల 28 నుంచి 3 వరకు నిర్వహించిన జాతీయ డైమండ్ జూబ్లీ జంబోరీ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరానికి హెడ్‌స్టాఫ్‌గా కాచిగూడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ వి.లక్ష్మణ్‌నాయక్ పనిచేశారు. తన సేవలను గుర్తించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ బి.భత్రి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసినట్లు లక్ష్మణ్‌నాయక్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ లక్ష్మణ్‌నాయక్‌ను పాఠశాల హెడ్‌మాస్టర్ కె.విజయలక్ష్మి, రాములు నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

కాచిగూడ,ఫిబ్రవరి 5: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడి సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకా రం.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన పోచయ్య కుమారుడు మణికంఠ(33)కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బుధవారం విద్యానగర్-జామైఉస్మానియా రైల్వేస్టేషన్ల మధ్య అంబేద్కర్‌నగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ చిమ్మానాయక్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

కార్వాన్, ఫిబ్రవరి 5 : టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైంది. ఏఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రాలోని హరిదర్గా ప్రాంతానికి చెందిన సయ్యద్ ముజీబ్‌కు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. వీరిలో ఫౌజియా బేగంకు నాలుగేండ్ల క్రితం మహ్మద్ హసన్ అలియాస్ ఆరిఫ్ అనే వ్యక్తితో వివాహం జరిపించగా వారికి ముగ్గురు పిల్లలున్నారు. గత ఏడాది వీరిద్దరికి విడాకులయ్యాయి. దీంతో ఫౌజియా బేగం తన ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టింట్లోనే ఉంటున్నది.రెండు రోజుల క్రితం దవాఖానాకు వెళుతున్నానని చెప్పిన ఆమె ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు టప్పాచబుత్రా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు.

తిలక్‌నగర్‌లో మరొకరు..

అంబర్‌పేట : నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూనల్లకుంట, తిలక్‌నగర్‌కు చెందిన కె.నర్సింహ భార్య కె.రాజమణి(58) ఈ నెల 4న ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి వరకు చూసినా ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు కె.శంకర్, ఇతర కుటుంబసభ్యులు అంతటా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజూ 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ

- వార్డు కార్యాలయంలో దొరకని దరఖాస్తు ఫారాలు
- జీరాక్స్ షాపుల్లో జోరుగా అమ్మకాలు

జియాగూడ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసేందుకు క్యూలైన్‌లో వేచిఉన్న మహిళలు

జియాగూడ, ఫిబ్రవరి 5 : ప్రజాపాలన పథకాల కోసం జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో రెండో రోజు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారం జియాగూడ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసేదుకు ఉదయం నుంచి మహిళలు, వృద్ధులు మండుటెండల్లో క్యూలైన్‌లో నిలబడ్డారు. చిన్న పిల్లలను తీసుకుకొని దరఖాస్తు చేసేందుకు వస్తున్న మహిళలకు కనీసం సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తు చేసిన వారి వివరాలు అన్‌లైన్‌లో లేకపోవడంతో మళ్లీ పెద్ద ఎత్తున దరఖాస్తు చేయడానికి వస్తున్నారు. ఎండలు మండుతుండడంతో కనీసం టెంట్ కూడా ఏర్పాటు చేయలేదంటున్నారు. కాగా వార్డు కార్యాలయంలో లభిచని దరఖాస్తు ఫారాలు పక్కనే గల జిరాక్స్ షాపుల్లో జోరుగా లభ్యమవుతున్నాయి. అయినా అధికారులు పంటిం చుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన దరఖాస్తులు ప్రజల కోసం ఉచితంగా ఇచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

టోలిచౌకి చౌరస్తాలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం ఫిబ్రవరి 5 : అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని టోలిచౌకి, నానల్‌నగర్, లంగర్‌హౌస్,గుడిమల్కాపూర్ డివిజన్లలో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ జీహెచ్‌ఎంసీ, జలమండలి, ప్రాజెక్ట్ అధికారులతో కలిసి పర్యటించారు. సందర్భంగా ఎన్‌పీ 2 పైప్‌లైన్, సివరేజ్ లైన్, వీడీసీసీ రోడ్ల నిర్మాణపనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కార్వాన్ : గుడిమల్కాపూర్ డివిజన్‌లోని బాలాజీనగర్ కాలనీలో బుధవారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ అడికి నేతృత్వంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సామ సురేందర్‌రెడ్డి, మామిడి వెంకటేశ్, జి. సంతోష్, వెంకట్రావ్, వెంకటరమణ తదితరులున్నారు.

గుండెపోటుతో విశ్రాంత ప్రొఫెసర్ మృతి

రిటైర్డ్ ప్రొఫెసర్ జ్యోతి(ఫైల్)

కాచిగూడ,ఫిబ్రవరి 5: ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ జ్యోతి(76)మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. కోఠి, ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్‌గా పలు కళాశాలలో, బోర్డు ఆఫ్ స్టడీ చైర్మన్, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. భారత మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా వ్యవహరించారు. భారత మహిళా క్రికెటర్లు పూర్ణిమా రావు, రజిని, వేణుగోపాల్, మిథాలీరాజ్, సురేఖ, లక్ష్మి, మాజీ కులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంతమ్మ, డాక్టర్ సోమన్న, డాక్టర్ బి.లక్ష్మయ్య, తదితరులు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు.

నేడు సంజీవయ్యనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

అంబర్‌పేట, ఫిబ్రవరి 5 : నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బస్తీ పెద్దలు సీహెచ్ భగవాన్ తెలిపారు. అంబేద్కర్ శతాబ్ది భవన్ వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

వనస్థలిపురం : బీసీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ అన్నారు. మహేశ్‌రెడ్డి, మల్లారెడ్డి సోషల్ మీడియాలో బీసీలను కించపరిచే విధంగా కామెంట్లు చేశారన్నారు. వారిపై బుధవారం వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీసీలను అణిచివేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రాజకీయ చైతన్యంతో ముందుకు సాగుతున్న బీసీల స్ఫూర్తిని దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. వారిపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

సాంస్కృతిక పునర్జీవ వైతాళికుడు వట్టికోట అళ్వారుస్వామి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5: సాంస్కృతిక పునర్జీవనానికి పునాదులు వేసిన వైతాళికుడు వట్టికోట అళ్వారు స్వామి అని నగర కేంద్ర గ్రం థాలయ సంస్థ చైర్మన్ ఎ.ఉపేందర్‌రెడ్డి అన్నా రు. చిక్కడపల్లిలోని గ్రంథాలయంలో వట్టికోట అళ్వారుస్వామి వర్ధంతి నిర్వహించారు. కార్యదర్శి పి.పద్మజతో కలిసి వట్టికోట ఆళ్వారుస్వామి చిత్రపటానికి చైర్మన్ పూలమలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాహిత్య గట్టి కోట అని కొనియాడారు.

కార్యక్రమంలో సీనీఎల్ ఇన్‌చార్జి సుబ్బలక్ష్మి, గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది కవిత, మహేశ్వరి, ఉమ